

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కరీంనగర్
శుక్రవారం | డిసెంబర్ 01, 2023 | www.navatelangana.com



భవితవ్యం భద్రం..



ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. మూడునాలుగుచోట్ల చెదురుమొదురు ఘటనలు తప్ప అంతటా ప్రశాంతంగా పోలింగ్‌ప్రక్రియ ముగిసింది. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభమైనా మధ్యాహ్నం 12వరకు మందకోడిగానే సాగింది. మధ్యాహ్నం ఒంటిగంట తరువాతనే స్పీడందుకుని నాలుగు జిల్లాలో సరాసరి 70శాతం మేరకు పోలింగ్ నమోదైంది. సిరిసిల్ల అభ్యర్థి కేటీఆర్ హైదరాబాద్‌లోని బంజారహిల్స్‌లో తన ఓటు హక్కు వినియోగించుకోగా.. మిగతా అభ్యర్థులంతా తమ నియోజకవర్గాల్లోనే ఫ్యామిలీతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం నుంచి ఆయా బూత్‌ల్లో పోలింగ్ సరళిని ఆయా ప్రధానపార్టీ అభ్యర్థులు పరిశీలించారు. గన్నేరువరం మండలంలో గులాబీరంగుచొక్కా వేసుకుని ఓట్లు అడిగాడని బీఆర్ఎస్ అభ్యర్థి రసమయిని పలువురు నిలదీయడంతో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. తప్ప అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఈవీఎం మిషన్లు స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరగా.. డిసెంబర్ 3న ఓట్లలెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

2లో...

- నవతెలంగాణ,
కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి / సిరిసిల్ల / పెద్దపల్లి

ప్రశాంతగా ముగిన పోలింగ్

- ఈవీఎం బాక్స్‌ల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం
- ఉదయం మందకోడిగాసాగి.. మధ్యాహ్నం ఊపందుకున్న పోలింగ్
- సాయంత్రం పలుచోట్ల బారులు తీరిన ఓటర్లు
- సిరిసిల్ల నియోజకవరంలో తగ్గిన పోలింగ్‌శాతం
- ఫ్యామిలీతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న ప్రధానపార్టీల అభ్యర్థులు
- పలు బూత్ కేంద్రాలను పరిశీలించిన ఆయా పార్టీల అభ్యర్థులు
- గన్నేరువరంలో గులాబీరంగు చొక్కవేసుకుని వచ్చారని రసమయిపై ఆరోపణ.. స్వల్ప ఉద్రిక్తత
- డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపుతో వెలువడనున్న తుది ఫలితాలు
- కరీంనగర్‌లో ముందస్తు సంబురాల్లో కాంగ్రెస్ శ్రేణులు





భవితవ్యం భద్రం..

నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయప్రతినిధి / సిరిసిల్ల / పెద్దపల్లి

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాలో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. 3,417 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైనా 11గంటల వరకు అన్ని కేంద్రాల్లో కనీసం 20శాతం కూడా దాటని పోలింగ్ మందకోడిగానే సాగింది. మధ్యాహ్నం 12తరువాత అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్‌బూత్‌లలో ఓటింగ్ శాతం ఊపందుకుంది. సాయంత్రం 5గంటల వరకే పోలింగ్ గడువు ముగియడంతో అప్పగి వరకు కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలో 69.22, 69.83శాతం నమోదుకాగా.. జగిత్యాల జిల్లాలో 74.87, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 71.87శాతం పోలింగ్ నమోదైంది. ప్రధానపార్టీలు బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ సహా ఏఐఎఫ్‌బీ వంటి చిన్నపార్టీలు, స్వతంత్రులు కలుపుకుని పోటీ చేసిన 216 మంది భవితవ్యం.. వారికొచ్చిన ఓట్ల సంఖ్య ఈవీఎం బాక్స్‌ల్లో నిక్షిప్తమై ఉంది. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు ముందస్తుగానే ఉమ్మడి జిల్లాలో గుర్తించిన 729 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో పోలీసుల పటిష్టబందోబస్తుతో ఎక్కడా ఘర్షణలు చోటుచేసుకోలేదు. నాలుగు జిల్లాల్లో కలిపి 13,872 మంది పోలీసులు విధులు నిర్వర్తించారు. వేములవాడ పట్టణంలో తొలిసారి ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సిరిసిల్ల బీఆర్ఎస్ అభ్యర్థి కేటీఆర్ తన ఓటును హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో వినియోగించుకోగా.. మిగిలిన అభ్యర్థులంతా తమ నియోజకవర్గ కేంద్రాల్లోనే ఓటు వేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం మంథని నియోజకవర్గంలో 4గంటల వరకే పోలింగ్ ముగించారు. పోలింగ్ ముగిశాక ఈవీఎంలను స్టాంగ్ రూమ్లకు చేర్చారు. ఆయా జిల్లాల్లోని స్ట్రాంగ్ రూమ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఏదేమైనా డిసెంబర్ 3న నిర్వహించబోయే ఓట్ల లెక్కింపుతో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

పలుచోట్ల ఈవీఎం మొరాయింపు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో 144 నెంబర్ పోలింగ్ కేంద్రంలో నిర్వహించిన మాక్‌పోలింగ్ సమయంలో ఈవీఎంలలో సాంకేతిక సమస్య ఏర్పడి మొరాయించాయి. పోలింగ్ సమయానికి సరి చేసినా అరగంట ఆలస్యమైంది. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం 302, గొల్లపల్లి 228, ధర్మపురి మండలం 39బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. పోలింగ్ గంటకుపైగా ఆలస్యమైంది. కరీంనగర్ జిల్లా మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ 247 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంట పోలింగ్ ఆలస్యమైంది. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం రామడుగు మండల కేంద్రంలోని 86వపోలింగ్ కేంద్రంలో వేయికి పైగా ఓటర్లు ఉన్నా సరిపడా సిబ్బంది లేక ఒకటే ఈవీఎం మిషన్ పెట్టడంతో ఓటర్లు చాలా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో రిటర్నింగ్ అధికారికి తెలియజేయడంతో అదనపు ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు. చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలం గర్శకుర్తిలో రెండు బూత్‌లలో ఈవీఎంలు మొరాయించగా, సిబ్బంది మరమ్మత్తులు చేసి పునరుద్దరించారు. గట్టుభూత్కూర్, మధురానగర్, ఉప్పరమల్యాల, బూర్గుపల్లి, గర్శకుర్తి, గంగాధరతోపాటు ప్రతి గ్రామంలోని 5 గంటలు దాటిన ఓటర్లు క్యూలూన్లలో బారులుదీరి కనిపించారు. అయితే క్యూలైన్లలో నిలబడిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని 89 నెంబర్ పోలింగ్ కేంద్రంలో, పెద్దపల్లి మండలం పెద్దకల్వల, భోజన్నపేట పోలింగ్ కేంద్రాల్లో అరగంటపాటు ఈవీఎంలు మురాయించాయి. ఓదెల మండలం గుండ్లపల్లి పోలింగ్ కేంద్రంలోనూ కొంత సమయం వరకు ఈవీఎం మురాయించింది.

పలుచోట్ల చెదురుమొదురు ఘటనలు

- మానకొండూర్ నియోజకవర్గంలోని గన్నేరువరం మండలం గునుకులకొండాపూర్‌లోని పోలింగ్ కేంద్రంలోకి గులాబీరంగు చొక్కాతో వచ్చి ఓట్లు అభ్యర్థించారని బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను స్థానిక మహిళలు ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు నిలదీయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరుగ్రూపులకూ సర్దిచెప్పడంతో ఉద్రిక్తత వీడింది.
- పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో గూడెంలో రోడ్డు వద్ద కొంతమంది పోకిరిలు మద్యం సీసాలు పగలగొట్టి అల్లరి చేశారు. మడక గ్రామంలో ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు ప్రచార నిమిత్తం ఒకరికొకరు గొడవకు దిగారు. ఎలిగేడు మండలంలో పెద్దపెల్లి టిఆర్ఎస్ అభ్యర్థి సిట్టింగ్ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి వియ్యంకుడు రామ్‌రెడ్డి పలు వార్డుల్లో డబ్బులు పంచుతూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారని ఆరోపిస్తూ స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని పెద్దపెల్లి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.
- వేములవాడ నియోజకవర్గం కథలాపూర్ మండలం బొమ్మెన గ్రామంలో ఏనుగు రాజవ్వ ఓటరు,ఆధార్‌కార్డులో పేరు వేరుగాఉందని ఓటు వేయనియ్యకపోవడంతో బోరున ఏడ్చింది.

ఆయా నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్

నియోజకవర్గం	పోలింగ్ శాతం
కరీంనగర్	64.17
చొప్పదండి(ఎస్సీ)	77.67
మానకొండూర్	75.12
హుజూరాబాద్	70.23
సిరిసిల్ల	73.42
వేములవాడ	78.43
జగిత్యాల	73.54
కోరుట్ల	73.68
ధర్మపురి	77.50
రామగుండం	67.21
పెద్దపల్లి	67.10
మంథని	74.12

సిరా చుక్క వేలికి కాదు.. కాలికి..

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన అరుణ్‌కు రెండు చేతులు లేవు. అయినా పోలింగ్ కేంద్రానికి వచ్చి మరీ ఓటు హక్కు వినియోగించుకున్నాడు. చిన్నతనంలోనే విద్యుత్‌షాక్ గురై రెండు చేతులు పోగొట్టుకున్న అరుణ్ తన కాలివేలుతో ఓటు వేసి అదే వేలుకు సిరా చుక్క వేయించుకున్నాడు. రెండు చేతులు లేకపోయినా తన 18వ ఏట నుంచి తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్టు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడిపై దాడి పట్ల ఖండన

మానేరు హోటల్ అధినేత, కాంగ్రెస్ నాయకుడు అబూబకర్‌కాళీపై బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేశాయని 'హస్తం' శ్రేణులు ఆందోళన చేశాయి. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కుల సంఘాల జేఏసీ చైర్మెన్ గజ్జకాంతం మీడియా ఎదుట తెలిపారు. ఆయన్ను కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్ సహా పలువురు నాయకులు పరామర్శించారు. కరీంనగర్ శివారులోని రేకుర్తి వద్ద కాంగ్రెస్ నేత ఖాలీద్ ప్రయాణిస్తున్న కారును అడ్డగించి కొందరు దాడి చేశారు. దీంతో కారు అద్దాలు పగిలాయి. ఓడిపోతున్నాననే భయంతోనే బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్, ఆయన అనుచరులు దాడులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. దాడులకు కాంగ్రెస్‌నాయకులు, మైనార్టీలు భయపడుతారని అనుకుంటే తగిన సమాధానం చెబుతామని అన్నారు.

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలపై కరీం'నగరం'లో 'హస్తం' సంబురాలు

అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ అనంతరం వెల్లడైన పలు సంస్థల ఎగ్జిట్‌పోల్ ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఆ సర్వేలన్నీ కాంగ్రెస్ సంపూర్ణ మెజార్టీతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ప్రకటించిన నేపథ్యంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఇచ్చిన పిలుపుమేరకు కరీం'నగరం'లో 'హస్తం' శ్రేణులు సంబురాలు నిర్వహించారు. ఈ సంబురాల్లో కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి సహా పలువురు శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పురుమల్ల మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారం చేపట్టబోయేది కాంగ్రెస్ పార్టీయేనని, డిసెంబర్ 3న ఆ ఫలితం అందరూ చూస్తారని అన్నారు. అధికారదుర్వినియోగం, అవినీతికి పాల్పడ్డ బీఆర్ఎస్‌కు గుణంపాఠం చెప్పిన ప్రజల తీర్పు మరో రెండు రోజుల్లో వెలువడుతుందని అన్నారు.



రామడుగు: వికలాంగుడిని పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న సిబ్బంది

సిరిసిల్లలో తగ్గిన ఓటింగ్ శాతం

2018 అసెంబ్లీ ఎన్నికల్లో సిరిసిల్ల నియోజకవర్గంలో 80.48శాతం పోలింగ్ నమోదు కాగా ఈసారి కేవలం 73.42శాతం నమోదయింది. గత ఎన్నికల పోలింగ్‌తో పోల్చితే 7.06శాతం తగ్గింది. గురువారం ఉదయం 7గంటలకు పోలింగ్ మొదలు కాగా కొన్ని కేంద్రాల్లో ఈవీఎంలు మురాయించడంతో కొంత ఆలస్యమైంది. ప్రారంభంలో కాస్త నెమ్మదిగా కొనసాగిన పోలింగ్ మధ్యాహ్నం ఒంటిగంట నుంచి పోలింగ్ శాతం పెరుగుతూ వచ్చింది. ఉదయం 9 గంటల వరకు 10.71శాతం, 11గంటల వరకు 22.05శాతం మాత్రమే నమోదుకాగా.. మధ్యాహ్నం ఒంటిగంట తరువాత42.73శాతానికి పెరిగింది. మధ్యాహ్నం 3 గంటల వరకు58.95 శాతం నుంచి సాయంత్రం 5గంటల వరకు 73.42శాతం పోలింగ్ నమోదైంది.

రామడుగు మండలంలో ప్రశాంతంగా పోలింగ్





నవతెలంగాణ - రామడుగు

మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని 86వ పోలింగ్ కేంద్రంలో వేయికిపైగా ఓటర్లు ఉన్నా ఎలక్షన్ సిబ్బంది లేకపోవడంతో చాలా ఇబ్బందులకు గురయ్యారు. దీంతో రిటర్నింగ్ అధికారికి తెలియజేయడంతో ఎన్నికల సిబ్బందిని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించారు.

తిమ్మాపూర్ మండలంలో..

నవతెలంగాణ - తిమ్మాపూర్

మండలంలో ఉదయం పోలింగ్ ప్రారంభమైన 7గంటల నుండే గ్రామాల్లో ఓటర్లు బారులుదీరారు. మధ్యాహ్నం వరకే ఓటింగ్ భారీగా జరిగింది. పర్లపల్లి, పోరండ్ల, రామకష్ణకాలనీ గ్రామాల్లో మోడల్ పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అల్గునూర్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు మరోసారి తనను ఆశీర్వదిస్తారని దీమా వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు.

మేడిపల్లి సత్యం గెలవాలని కోటిలింగాలలో ముడుపు కట్టిన శేఖర్ ముదిరాజ్



నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేడిపల్లి సత్యం ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలవాలని నియోజకవర్గ కేంద్రానికి చెందిన నూనె శేఖర్ ముడుపు కట్టారు. మేడిపల్లి సత్యం వీరాభిమాని నూనె శేఖర్ ముదిరాజ్ జగిత్యాల జిల్లాలోని వెల్గటూర్‌లోని కోటిలింగాల కోటిలింగేశ్వర స్వామిని ప్రత్యేకంగా దర్శించుకుని, మేడిపల్లి సత్యం పేరు మీద అర్చన చేయించి ముడుపు కట్టారు.

గన్నేరువరం మండలంలో 85 శాతం పోలింగ్

నవతెలంగాణ - గన్నేరువరం

మండల వ్యాప్తంగా స్వల్ప ఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగింది. గునుకుల కొండాపూర్‌లోని 247 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో గంటపాటు పోలింగ్ ఆలస్యమైంది. మండల వ్యాప్తంగా 85 శాతం పోలింగ్ నమోదు జరిగిందని మండల నోడల్ అధికారి కిరణ్మయి వెల్లడించారు. నూతనంగా ఓటు వేసిన యువకులు ఆనందం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలకిషన్ గులాబి రంగు చొక్కాతో పోలింగ్ బూతు వద్ద కారు గుర్తుకు ఓటు వేయాలని అడిగారని పలువురు మహిళలు ఆరోపించారు. కాంగ్రెస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్వల్ప ఉద్రిక్తతకు దారి తీయగా పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.




పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ చందా నరసింహారావు



- సిరిసిల్ల నియోజవర్గంలో 73.42 శాతం పోలింగ్
- గత ఎన్నికలతో పోలిస్తే సిరిసిల్లలో 7.06శాతం తగ్గిన ఓటింగ్
- వేములవాడ నియోజకర్గంలో 70.17శాతం నమోదు

ప్రశాంతంగా పోలింగ్





తంగళ్లపల్లి : బస్వాపూర్ లో ఓటు హక్కు వినియోగించుకున్న జెడ్పీటీసీ దంపతులు



వేములవాడ : ఓటు హక్కును వినియోగించుకున్న ట్రాన్స్ జెండర్లు



సిరిసిల : ఓటింగ్ సరళి పై బూత్ లెవెల్ అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్



పోలింగ్ కేంద్రం పరిశీలిస్తున్న ఎన్నికల పోలీసు పరిశీలకురాలు సాహు



సిరిసిల్లా టౌన్ : గులాబీ రంగు చొక్కాలతో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూ కట్టిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ - సిరిసిల్ల/ వేములవాడ

సిరిసిల్ల నియోజకవర్గంలో గురువారం శాసనసభ ఎన్నికల పోలింగ్ 73.42 శాతం జరిగింది. ఉదయం నుంచే సిరిసిల్ల నియోజకవర్గం లోని పట్టణాలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ కనిపించాయి. కొన్ని గ్రామాల్లో ఉదయం మందకోడిగా పోలింగ్ సాగినా మధ్యాహ్నానికి పుంజుకుంది. మహిళలు వద్దులు యువతలో ఓటు చైతన్యం ఎక్కువగా కనిపించింది. అన్ని పార్టీల అభ్యర్థులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి కేటీఆర్, కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి రాణి రుద్రమరెడ్డి, స్వతంత్ర అభ్యర్థి శ్రీనివాస్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించి పోలింగ్ సరళిని పర్యవేక్షించారు.కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్, జిల్లా ఎస్పీ అఖిల్ మహజన్, ఎన్నికల పరిశీలకులు పోలింగ్ కేంద్రాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

వేములవాడ నియోజకవర్గాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఎన్నికల పోలింగ్ కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా జిల్లా అధికారులు పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షించారు.ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అధికారులు ఎప్పటికప్పుడు అధికారులకు దిశా నిర్దేశం. నియోజకవర్గంలో 70.17 శాతం పోలింగ్ నమోదు అయింది. ఈవిఎం లను తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన రిసెప్షన్ సెంటర్‌కు తరలించి అక్కడ ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచనున్నారు.కమాండ్ కంట్రోల్ రూం నుండి వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యా నాయక్ పర్యవేక్షించారు. కమాండ్ కంట్రోల్ రూం వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ సరళిని సాధారణ పరిశీలకులు డాక్టర్ జగదీష్ సొన్ కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు వినిత సాహు, ఎన్నికల వ్యయ పరిశీలకులు జి. మణిగండసామిలు పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో దివ్యాంగులు, వద్దులు, ట్రాన్స్ జెండర్లు వారి వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు అనేది చాలా విలువైందని సిట్టింగ్ ఎమ్మెల్యే రమేష్ బాబు అన్నారు. గురువారం అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఆయన ఓటు హక్కును వినియోగించుకొని ఓటు ద్వారా సరైన అభ్యర్థిని ఎన్నుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం

నవతెలంగాణ - సిరిసిల్ల టౌన్

సిరిసిల్ల పట్టణంలోని గాంధీనగర్ 122 పోలింగ్ బూత్ వద్ద బీఆర్ఏస్ ఏజెంట్, నాయకుల డ్రెస్ కోడ్ పై వివాదం నెలకొంది. బీఆర్ఎస్ ఏజెంట్ గులాబీ రంగు ఉన్న చొక్కాను ధరించగా, అంతేగాక బూత్ వెలుపల కొంతమంది బీఆర్ఎస్ కార్యకర్తలు గులాబీ చొక్కాలతో దర్శనమిచ్చారు. దీంతో ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించారంటూ కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. దీంతో ఇరు పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగి ఉద్రిక్త పరిస్థితులు నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు, కేంద్ర బలగాలు అక్కడికి చేరుకొని బందోబస్తే నిర్వహించారు. బీఆర్ఎస్ కాంగ్రెస్ నాయకులు మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొద్దిసేపటి వరకు పోలింగ్ నిలిపివేశారు. అనంతరం ఎన్నికల అధికారి వచ్చి ఇరుపక్షాలకు సర్ది చెప్పడంతో తిరిగి పోలింగ్ ప్రారంభం అయింది.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన మంత్రి కేటీఆర్...

నవతెలంగాణ - తంగళ్ళపల్లి

ఎన్నికలు తంగళ్ళపల్లి మండలంలో ప్రశాంతంగా ముగిసాయి. మంత్రి కేటీఆర్ మండలంలోని జిల్లెల్ల, తంగళ్ళపల్లి గ్రామంల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ బూతుల్లోకి వెళ్లి వివరాలు ఎన్నికల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లోని ఓటర్ల ఓట్లు గల్లంతయ్యాయి. పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్ల పేర్లు ఓటర్ లిస్టులో లేకపోవడంతో ఓటర్లు నిరాశగా వెనుతిరిగారు.

మొరాయించిన ఈవీఎం, వీవీ ప్యాడ్..

తంగళ్ళపల్లి మండలంలోని పలుచోట్ల ఈవీఎంలు, వి వి ప్యాడ్ లు మొరాయించాయి. తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో అరగంట పాటు ఓటింగ్ నిలిచిపోయింది. పొలింగ్ మొదలైన గంట తరువాత 129 ఓట్లు పోలయ్యాక వివి ప్యాడ్‌లోని పేపర్ కటింగ్ కాలేదు. అరగంట పాటు ఓటింగ్ నిలిచిపోయింది. దాని స్థానంలో మరో వీవీ ప్యాడ్‌ను ఏర్పాటు చేసి ఓటింగ్‌ను మళ్లీ కొనసాగించారు. తంగళ్ళపల్లి మండల కేంద్రంలోని 191 పోలింగ్ బూత్ లో ఉదయం 6 గంటలకు మాకు పోలింగ్ను ఎన్నికల అధికారులు నిర్వహించగా 7 ఓట్లను మాక్ పోలింగ్ నిర్వహించగా... ఏడు ఓట్లకు బదులుగా 14 ఓట్లు వచ్చాయి. డబుల్ ఓట్లు రావడంతో అధికారులు ఈవీఎంలను సరి చేశారు.

ఓటేసేందుకు వచ్చిన ఎన్ఆర్ఐ...

సర్కారు సినిమాలో హీరో ఓటు వేసేందుకు అమెరికా నుండి వచ్చిన హీరో మాదిరిగా...ఆ మాదిరిగానే దుబాయ్‌లో ఉంటున్న ఓ ఎన్నారై ఓటు వేసేందుకే దుబాయ్ నుంచి వచ్చి ఓటు వేశాడు. తంగళ్ళపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన అరకుటి మల్లేశం దుబాయిలో కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. అతని వద్ద 200మందికి పైగా కార్మికులు పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గురువారం గ్రామంలో నిర్వహిస్తున్న ఎన్నికల్లో ఓటు వేసేందుకు బుధవారం ఇంటికి తిరిగి వచ్చానని మల్లేశం తెలిపాడు. తన ఓటును కూడా వినియోగించుకున్నట్లు తెలిపారు.

ఓటేసిన రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌రావు

నవతెలంగాణ - బోయినిపల్లి

బోయినిపల్లి మండలం లోని కోదురుపాక గ్రామంలో రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ కుమార్ తన సతీమణి రోహిణి తో కలిసి వచ్చి ఓటు వేసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా తను మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మూడవ సారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతాడని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు ఉద్యమ పార్టీని మరిచిపోలేదన్నారు.

బోయినపల్లి మండలం లోని 23 గ్రామాలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా ముగిశాయి. మండలం 23 గ్రామాలలో 79.48 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. దేశాయి పల్లెలో బీఎస్పీ పార్టీ అభ్యర్థి కొనకటి శేఖర్ ఓటు వేశారు. కొదురుపాకలో జడ్పిటిసి ఉమా కొండయ్య, సర్పంచ్ జోగినపల్లి శ్యామల దేవి, టిఆర్ఎస్ సీనియర్ నాయకులు జోగినిపల్లి రవీందర్ రావు, తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నవతెలంగాణ - రుద్రంగి

రుద్రంగిలో ఓట్లు వేయడానికి ఉదయం నుండే జనం బారులు తీరారు. ఓటు వేయడానికి వచ్చే ఓటర్ల కోసం గ్రామంలోని 7పోలింగ్ బూతులలో ఎన్నికల అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ధర్మ సమాజ్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గడ్డం హరీష్ గౌడ్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎన్నికల పోలింగ్ కేంద్రాలను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మేడ లక్ష్మీ నరసింహారావు, బీఎస్పీ అభ్యర్థి గోలి మోహన్ పరిశీలించారు. 95వ నెంబర్ పోలింగ్ బూత్‌లోని ఈవీఎం మొరయించడంతో కొద్దిసేపు ఓటర్లు ఇబ్బంది పడ్డారు. ఎన్నికల అధికారులు మొరాయించిన ఈవీఎం స్థానంలో మరో ఈవీఎం ను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. పోలింగ్ ముగిసే సమయానికి మండల కేంద్రంలో 8288 ఓటర్స్‌గాను 6205 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.74.86 శాతం పోలింగ్ నమోదైంది.

నవతెలంగాణ - కోనరావుపేట

కొనరావు పేట మండలలోని మల్కాపేట గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి చెలిమిడ లక్ష్మీనరసింహారావు, మాజీ మంత్రి చల్మెడ ఆనందరావులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నాగారం గ్రామంలో బీజేపీ అభ్యర్థి చేన్నమనేని వికాస్‌రావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని మొత్తం ఓట్లు 34250 పోల్ అవగా 79.59శాతం ఓటింగ్ నమోదైంది. కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘర్షణ ఏర్పడింది.





పోలింగ్ చిత్రమాలిక


బూరుగుపెల్లి లో ఓటు హక్కు వినియోగించుకున్న సుంకె రవిశంకర్ కుటుంబ సభ్యులు


పచ్చనూరు గ్రామంలో కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులు


పచ్చనూరు గ్రామంలో కవ్వంపల్లి సత్యనారాయణ కుటుంబ సభ్యులు


ఓటు వేసిన బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్


జగిత్యాల కాంగ్రెస్ అభ్యర్థి టి. జీవన్ రెడ్డి


జగిత్యాల బీజేపి అభ్యర్థి భోగ శ్రావణి


చొప్పదండి కాంగ్రెస్ అభ్యర్థి మేడిపెల్లి సత్యం


మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు


మంథని కాంగ్రెస్ అభ్యర్థి శ్రీధర్‌బాబు


క్రిస్టియన్ కాలనీ బూత్‌లో కుటుంబ సమేతంగా ఓటు వేసిన గంగుల కమలాకర్




తంగళ్ళపల్లి మండలంలో పోలింగ్ కేంద్రంలో మంత్రి కేటీఆర్




ఓటు హక్కు వినియోగించుకున్న కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి


ఓటు హక్కు వినియోగించుకుంటున్న కరీంనగర్ బిజెపి అభ్యర్థి బండి సంజయ్ దంపతులు



కరీంనగర్ ఏఐఎఫ్‌బి అభ్యర్థి అంబటి జోజిరెడ్డి


బొమ్మకల్ గ్రామంలో పురుమల్ల శ్రీనివాస్ దంపతులు


ఓటు వేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి ఆయన సతీమణి ఆబాగుప్త


ఓటు వేసిన అదనపు కలెక్టర్ కిమ్యా నాయక్


ఓటు వేస్తున్న హుజురాబాద్ బీజేపి అభ్యర్థి ఈటెల రాజేందర్


ఓటు వేసిన వేములవాడ సిట్టింగ్ ఎమ్మెల్యే సిహెచ్. రమేష్ బాబు


హుజురాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి ప్రణయ్


జగిత్యాల బీఆర్ఎస్ అభ్యర్థి డా॥ సంజయ్‌కుమార్ దంపతులు


బోయినిపల్లిలో వృద్ధుని ఓటు వేసేందుకు తీసుకెళ్తున్న కుటుంభ సభ్యులు


ఓటు హక్కు వినియోగించుకున్న సిరిసిల్ల ఎస్పీ అఖిల్ మహాజన్


కథలాపూర్‌లో మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతులు


వీర్నపల్లిలో ఓటు వేయడానికి బారులు తీరిన మహిళలు


జగిత్యాలలో ఓటు హక్కు వినియోగించుకున్న 105 ఏళ్ళ రుక్కమ్మ


కరీంనగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బోయినిపల్లి వినోద్‌కుమార్


వీర్నపల్లి మండల కేంద్రంలో ఓటు వేసిన నిర్మల్ సివిల్ జడ్జీ జోగిని పల్లి భవిష్య



హుజురాబాద్ మండలంలో చంటిపిల్లతో వచ్చిన బాలింత


వేములవాడ పట్టణ కేంద్రంలో మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకున్న (హిజ్రాలు) ట్రాన్స్ జెండర్స్


ఓటు వేసిన ఎమ్మెల్సీ ఎల్. రమణ కుటుంబం


కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్న వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చలిమెడ లక్ష్మీనర్సింహారావు


కుటుంబ సభ్యులతో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్న వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్


ఓటు హక్కు వినియోగించుకున్న సిరిసిల్ల ఆర్డీవో దంపతులు


కోదురుపాక లో ఓటు వేసిన రాజ్య సభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్ రావు దంపతులు

జగిత్యాల జిల్లాలో 74.87 శాతం నమోదు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

2023 సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా గురువారం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా చెదురుముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. ప్రజలు భారీ సంఖ్యలో హాజరై తమ ఓటు హక్కును ఉపయోగించుకున్నారు. జగిత్యాల జిల్లాలోని జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గాల్లో 74.87 శాతం పోలింగ్ నమోదు అయింది. 5 దాటినా కూడా కొన్ని చోట్ల ఓటర్లు పోలింగ్ కేంద్రాలలో క్యూలో ఉండగా కొంతమేర పోలింగ్ శాతం పెరిగే అవకాశాలున్నాయి. జగిత్యాల నియోజకవర్గంలో 73.54 శాతం కోరుట్లలో 73.68శాతం, ధర్మపురిలో 77.5శాతం మంది ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకున్నారు. జిల్లాల్లో ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి చర్యలు చేపట్టారు.





ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు

పోలింగ్ సరళిని సందర్శించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు

పోలింగ్ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి భోగ శ్రావణి, కోరుట్లల్లో బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్, కాంగ్రెస్ అభ్యర్థి జువ్వాడి నర్సింగ రావు, బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్, ధర్మపురిలో బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పలువురు ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

ఎన్నికల అధికారిణి,

కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా స్వేచ్ఛగా జరిగాయని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యిందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ షేక్ యాస్మిన్ భాషా తెలిపారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గాల్లో ఉదయం నుంచే ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరి, ఉత్సాహంగా ఓటింగ్‌లో పాల్గొన్నారని పేర్కొన్నారు. మూడు నియోజకవర్గాలలో ఇప్పటివరకు అందిన సమాచారం మేరకు 74.87 శాతం మంది ఓటు వేయడం జరిగిందని, జగిత్యాల నియోజక వర్గంలో 73.54శాతం, కోరుట్ల నియోజకవర్గంలో 73.68 శాతం, ధర్మపురి నియోజకవర్గంలో 77.50 శాతం పోలింగ్ జరిగిందని తెలిపారు. జిల్లాలోని 785 పోలింగ్ కేంద్రాలలో జిల్లా యంత్రాంగం, పోలీసుల సహకారంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగిందన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా వెబ్ కాస్టింగ్ కేంద్రాన్ని, మీడియా మానిటరింగ్ సెల్‌లను సందర్శించి పోలింగ్ ప్రక్రియలను కలెక్టర్ పర్యవేక్షించారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజీవ్ రంజన్ మీనా, హెచ్. బసవ రాజేంద్ర, పోలీస్ పరిశీలకులు వివేకానంద సింగ్ లు ఎన్నికల నిర్వహణ తీరుపై కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అధికారులు, సిబ్బంది, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్

పెరిగిన సీనియర్ సిటీజెన్స్ ఓటింగ్ శాతం

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లాలో సీనియర్ సిటిజన్స్ (వయోవృద్ధుల) 90 శాతం పైగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధికారుల ప్రత్యేక దృష్టి వల్లే ఎక్కువ శాతం పోలింగ్ నమోదు అయినట్టు తెలంగాణ అల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్ అన్నారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధులకు ఎన్నికల కమిషన్ ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించడంతో పోలింగ్ శాతం పెరిగిందని తెలిపారు. అంతే కాక పోలింగ్ రోజున వృద్ధులకు వీల్ చైర్ సౌకర్యం, దివ్యాంగులకు మహిళలకు, యువతీయువకులకు ప్రత్యేక భూత్‌లు ఏర్పాటు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సులు ఎంతో ఉపయోగపడ్డాయని తెలిపారు.

ఓటు వేసిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-ఇబ్రహీంపట్నం

ఇబ్రహీంపట్నం మండలంలోని గోదురు గ్రామంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇబ్రహీంపట్నం మండలంలో 73.68శాతం పోలింగ్ నమోద యింది. డబ్బా గ్రామంలో జడ్పీటీసీ కంటం భారతి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇదిలా ఉంటే డబ్బా గ్రామంలో ఈవీఎం కొద్దిగా మొరాయించడంతో వేరే ఈవీఎంను అధికారులు ఏర్పాటు చేశారు. దీంతో ఓట్ల ప్రక్రియ కొనసాగింది 32 పోలింగ్ కేంద్రంలో ఓట్ల వేసే ప్రక్రియ ఆలస్యం అయ్యింది. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గ్రామమైన మూడు బొమ్మల మేడిపల్లిలో పోలింగ్ కేంద్రానికి బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్విండ్ వెళుండగా ఆయ నతో పాటు ఆయన అనుచరులు వెళ్లగా బీఆర్ఎస్. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన చేశారు.

అమెరికా నుంచి వచ్చి ఓటేసిన అక్కాచెల్లెళ్లు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలకు చెందిన అక్కాచెల్లెళ్లు జిడిగే సంజన కృష్ణ, సత్యకృష్ణలు అమెరికా నుంచి వచ్చి ఓటు వేశారు. మొదటిసారి ఓటు వేయడం తమకు సంతోషంగా ఉందని తెలిపారు.

రాయికల్‌లో ముగిసిన పోలింగ్



ఓటు కోసం క్యూలైన్లో నిలబడిన మహిళలు

నవతెలంగాణ-రాయికల్

పట్టణంలోని 26వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో 45 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. సాయంత్రం 5 గంటల లోపు పోలింగ్ కేంద్రాలకు హాజరైన ఓటర్లకు వరుస క్రమంతో కూడిన రసీదులను పంపిణీ చేసిన అధికారులు 26,27 పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. పట్టణంలో 73.07శాతం ఓటింగ్ నమోదు కాగా గ్రామీణ ప్రాంతాల్లో 79.91,మండల వ్యాప్తంగా 76.49 శాతం ఓట్లు పోలైనట్లు రిటర్నింగ్ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రం వద్ద వృద్ధులతోపాటు ఓ మహిళ పదేపదే పోలింగ్ కేంద్రానికి రావడంతో బీఆర్ఎస్ నాయకులతో కాంగ్రెస్, బీజేపీ నాయకులు వాగ్వివాదానికి దిగారు. దీంతో ఘటనా స్థలంలోని పోలీస్ సిబ్బంది సంబంధిత మహిళతో పాటుగా ఘర్షణకు పాల్పడిన వారిని పోలింగ్ కేంద్రం ముందుభాగం నుండి బయటకు పంపించారు. మైతాపూర్ గ్రామానికి చెందిన మండల బీజేవైఎం కోశాధికారి బూస మనోజ్ తో పాటుగా గ్రామంలోని 30 మంది ఓట్లు గల్లంతు కావడంతో ఓటు హక్కును వినియోగించుకోక పోయారు.

మల్లాపూర్‌లో ప్రశాంతంగా పోలింగ్

నవతెలంగాణ-మల్లాపూర్

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. మండల వ్యాప్తంగా 50 పోలింగ్ స్టేషన్‌లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5గంటలకు ఓటర్లను కేంద్రంలోకి అనుమతి ఇచ్చారు. ఆయా గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం పూట ఈవీఎంల మిషన్‌లో కొద్దిసేపు మురాయించాయి. అనంతరం కొత్తగా ఓటు వచ్చిన యువతీ, యువకులు, వికలాంగులు ఓటు వేశారు. ఓబులాపూర్‌లో ఆదర్శ మహిళ పోలింగ్ కేంద్రం, కొత్తదాంరాజుపల్లిలో యూత్ పోలింగ్ కేంద్రం, గొర్రెపల్లిలో ఆదర్శ మాడల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కోరుట్ల నియోజకవర్గంలో 73.68 శాతం పోలింగ్ నమోదు అయింది. మల్లాపూర్ ఎంఆర్ఓ తహసీల్దార్ వీరసింగ్ పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా పర్యవేక్షించారు. సుమారు 250 మంది పోలింగ్ సిబ్బంది విధులు నిర్వహించారు. ఎస్సై నవీన్ కుమార్ ఎన్నికలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



క్యూలైన్లో నిలబడిన ఓటర్లు

కోరుట్లలో 73.68శాతం పోలింగ్

నవతెలంగాణ-కోరుట్ల

కోరుట్ల పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 73.68 శాతం పోలింగ్ నమోదైనట్టు ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన వడ్లకొండ రాజు 100 ఏండ్ల వృద్ధుడు ఓటు వేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నవతెలంగాణ
మనుగు తెలుగు దినపత్రిక
6
జగిత్యాల
శుక్రవారం 1 డిసెంబర్ 2023 www.navatelangana.com

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-జగిత్యాలటౌన్



పరిశీలిస్తున్న ఎస్పీ సన్ ప్రీత్‌సింగ్

జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ గురు వారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి సంఘటనలు జరగకుండా జిల్లా పోలీస్ శాఖ 3000 మంది పోలీస్, కేంద్ర బలగాలతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య రిసెప్షన్ సెంటర్ నుంచి స్ట్రాంగ్ రూమ్ అయిన వీఆర్కే కాలేజికి తరలించడం జరిగిందన్నారు. కేంద్ర బలగాలు బీఎస్ఎఫ్, రాష్ట్ర సాయుధ బలగాలు, సివిల్ పోలీసు అధికారులు, సిబ్బందితో స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్టమైన మూడంచెల భద్రత ఏర్పాటు చేసామన్నారు.

స్ట్రాంగ్ రూమ్ సెంటర్ల వద్ద పటిష్ట భద్రత

జిల్లా కేంద్రంలోని వీఆర్కే ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ హాల్స్, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత పరమైన ఏర్పాట్లను జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ గురువారం పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం పోలైన ఈవీఎంల భద్రత కోసం నియోజకవర్గాల వారిగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ హాల్‌ల వద్ద పూర్తి స్థాయిలో అవసరమైన పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. వీటి భద్రత కోసం కేంద్ర సాయుధ బలగాలని కేటాయించామన్నారు. విధుల్లో ఉన్న అధికారులకు తగు సూచనలు చేశారు.

బుగ్గారంలో 76 శాతం పోలింగ్ నమోదు



ఓటు వేస్తున్న ప్రజలు

నవతెలంగాణ-బుగ్గారం

బుగ్గారం మండలంలో శాసనసభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఎన్నికలు ముగిసేసరికి మండలంలో 76శాతం నమోదైంది. సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయడానికి ఫోటోలు బారులు తీరారు. అదే విధంగా నూతన ఓటర్లు ఎంత ఉత్సాహంతో వారి ఓటును వినియోగించుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వృద్ధులు, మహిళలను వాహనాల్లో తరలిం చడానికి ఏర్పాట్లు చేశారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్సై సందీప్ బందోబస్తు నిర్వహించారు.

ఓటు వేసిన ప్రముఖులు

నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాలరూరల్ మండలంలోని తన స్వంత గ్రామం అంతర్గాంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ దంపతులు, మాజీ మంత్రి రాజేశంగౌడ్ ఓటు హక్కు వినియో గించుకున్నారు. జగిత్యాల పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ ధరూర్ క్యాంప్ పోలింగ్ స్టేషన్ 177లో కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ బి.ఎస్.లత ఓటు వేశారు. పట్టణంలోని పాత బస్ స్టాండ్ వద్ద గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి.జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు, పట్టణంలోని పురాణిపేట హై స్కూల్‌లో ఎమ్మెల్సీ ఎల్. రమణ కుటుంబ సభ్యులు, పట్టణంలోని పురాణిపేట హై స్కూల్‌లో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి భోగ శ్రావణి తమ ఓటు హక్కు వినియోగిం చుకొన్నారు. జగిత్యాలరూరల్ మండలం పొలాస గ్రామంలోని పోలింగ్ కేంద్రం 116 జడ్పీహెచ్ఎస్‌లో 105 సంవత్సరాల రుక్కమ్మ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



జాబితాలో పేరు లేక వెనుదిరిగిన ఓటర్

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండలం అబ్బాపురం గ్రామానికి చెందిన పెద్ది రమేష్ అనే వ్యక్తి ఓటర్ కార్డు ఉంది. తమ ఓటును వినియోగించడానికి వచ్చి, ఓటర్ లిస్టులో తన పేరు లేనందుకు ఓటు హక్కు వినియోగించుకోకుండా వెనుదిరిగి వెళ్లిపోయాడు. బీఎల్వోల తప్పిదాలతో దాదాపుగా కొంతమంది ఓటర్ల పేర్లను నమోదు చేయకుండా గల్లంతయినట్లు అవేదన వ్యక్తం చేశారు.

పోలింగ్ ప్రశాంతం

నవతెలంగాణ-జూలపల్లి



ఓటు వేసేందుకు వికలాంగున్ని తీసుకెళ్తున్న సిబ్బంది

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సజావుగా కొనసాగింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమై పోలింగ్ సాయ ంత్రం ఐదు గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వయోవృద్ధులు, వికలాంగులను సిబ్బంది వీలు చేరుపై పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకెళ్లి ఓటు వేసేలా చూశారు.

ప్రశాంతంగా పోలింగ్



క్యూలైన్లో నిల్చున్న మహిళలు

నవతెలంగాణ-మంథని

మంథని నియోజకవర్గంలో గురువారం నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మంథని నియోజకవర్గంలో 74.12 శాతం నమోదయింది. నియోజకవర్గంలోని మంథని, కమాన్పూర్ రామగిరి,ముత్తారం, మల్హార్, కాటారం, మహాదేవ్‌పూర్, పలిమెల, మహాముత్తారం, పాలకుర్తి, గ్రామాల్లో పోలీసు బలగాలను మొహరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకున్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పుట్ట మధూకర్, చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బీఎస్పీ అభ్యర్థి చల్ల నారాయణరెడ్డి స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మంథని నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాం తంగా ముగియడంతో పోలీసులు, అధికారులు, ఊపిరి పీల్చుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



సుల్తానాబాద్-నవ తెలంగాణ

సుల్తానాబాద్ పట్టణంలో పోలింగ్ ప్రశాతంగా కొనసాగింది. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు క్యూలైన్లో నిల్చొని ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఏసీబీ ఎడ్ల మహేష్, సీఐ జగదీష్,ఎస్ఐ విజేందర్‌లు పర్యవేక్షించారు. ఓటరు కార్డు ఉండి లిస్టులో పేరు లేకపోవడంతో పలువురు ఓటు వేయకుండా వెనుదిరిగారు.

రాత్రి వరకు కొనసాగిన పోలింగ్

- సాయంత్రం ఐదు గంటల వరకు 69.45శాతం నమోదు
- ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

నవతెలంగాణ- పెద్దపల్లి

రాష్ట్ర సాధారణ ఎన్నికలు గురువారం జరిగిన ఎన్నికల్లో పెద్దపల్లి జిల్లాలో రాత్రి వరకు పోలింగ్ సాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మందకోడిగా సాగిన పోలింగ్ సాయంత్రం నుంచి వేగవంతమైంది. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ముగిసినప్పటికీ క్యూలైన్లో నిల్చున్న ఓటర్లు రాత్రి 8:30 వరకు ఓటింగ్ వేశారు.రామగుండం నియోజకవర్గంలో 67.21శాతం, పెద్దపెల్లి నియోజకవర్గం 67.1శాతం, మంథని నియోజక వర్గంలో 74.12 శాతం పోలింగ్ నమోదు అయింది. పెద్దపల్లి జిల్లాలోని మూడు నియో జకవర్గాల్లో 69.45 శాతం పోలింగ్ నమోదయింది. జిల్లాలో చెదురు మదురు సంఘటనలు మినహాయిస్తే పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. టెక్నికల్ సమస్యలతో ఉదయం ఈవీఎం మొరాయించగా అధికారులు వెంటనే కావడంతో ప్రశాంతంగా పోలింగ్ సాగింది. పెద్దపల్లి పట్టణ కేంద్రంలో 89వ పోలింగ్ కేంద్రంలో 30 నిమిషాల పాటు ఈవీఎం మొరాయించింది. పెద్దకల్వల, భోజన్నపేట పోలింగ్ కేంద్రాల్లో 30 నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించాయి. ఎలిగేడు మండలంలో పెద్దపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి దాసరి మనోహర్ రెడ్డి వియ్యంకుడు రామ్ రెడ్డి పలు వార్డుల్లో డబ్బులు పంచుతూ ఓటర్లను ప్రభావితం చేస్తుండగా స్థానిక కాంగ్రెస్ నాయకులు అడ్డుకొని పెద్దపల్లి ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశారు.

ముత్తారం మండలంలో 82.93శాతం పోలింగ్

- పోలీసుల పటిష్ట బందోబస్తు
- భద్రత ఏర్పాట్లను పరిశీలించిన పెద్దపల్లి డీసీపీ

నవతెలంగాణ-ముత్తారం:



ఓటు వేసేందుకు ఎండలో క్యూలో బారులు తీరిన మహిళా ఓటర్లు

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా మంథని నియోజక వర్గంలోని ముత్తారం మండలంలో గురువారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో 82.93శాతం ఓటింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గురువారం ఉదయం 07 గంటలకు ప్రారంభమైన పోలింగ్ ప్రక్రియ సాయంత్రం 4గంటల వరకు కొనసాగింది. అయితే 4 వరకు క్యూలో ఉన్న వారికి మాత్రమే ఎన్నికల అధికారులు ఓటింగ్ వేసేందుకు అనుమతి ఇచ్చారు. మండలంలోని పారుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం వద్ద వసతులు సరిగ్గా లేకపోవడంతో ఓటర్లు ఇబ్బందులకు గురయ్యారు. పోలింగ్ భద్రతా ఏర్పాట్ల కోసం ముత్తారం మండలంలో ఎస్ఐ మధుసూదన్ రావు ఆధ్వర్యంలో రాష్ట్ర పోలీస్ సిబ్బందితో పాటు సరిహద్దు రాష్ట్రాలకు చెందిన పోలీస్ బలగాలు, వివిధ కంపెనీల కేంద్ర సాయుధ బలగాలను కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లతో పోలింగ్‌ను ప్రశాంతంగా కొనసాగించారు. కాగా భద్రతా ఏర్పాట్లను పెద్దపల్లి డీసీపీ ఎం.చేతన పరిశీలించి, పలు సూచనలు చేశారు.

బీఆర్ఎస్ పార్టీకే ప్రజల మద్దతు కనిపిస్తోంది

బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని



అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గ ప్రజలు బీఆర్ఎస్ పార్టీకే మద్దతు తెలుపుతున్నట్లు కన్పిస్తోందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ అన్నారు. గురువారం మంథని మండలం వెంకటాపూర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉదయం నుంచి నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో జరిగిన సరళి పరిశీలిస్తే ప్రజలు బీఆర్ఎస్ పార్టీనే ఆదరిస్తున్నట్లు తెలుస్తోందన్నారు. ఆయా ప్రాంతాల్లో ఇప్పటికే 80శాతం ప్రజలు కేసీఆర్ సర్కార్‌ను కోరుకుంటూ తనను ఆశీర్వదిస్తున్నారని ఆయన తెలిపారు.మంథని నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఎన్నికల ప్రచారంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతానని,తాను ఇచ్చిన మాటకు కట్టుబడి పని చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

ప్రశాంత వాతావరణంలో పోలింగ్

- పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ రెమారాజేశ్వరి

నవతెలంగాణ-మంథని

తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు ప్రశాతంగా ముగిసాయని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వరి అన్నారు. గురువారం మంథని నియోజకవర్గ కేంద్రంలో ఆమె పోలింగ్ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి పోలీస్ బందోబస్తు మధ్య ఈవీఎంలను సిబ్బందిని ఎంతో సామాగ్రిని పోలింగ్ కేంద్రాలకు తరలించామన్నారు. ఎలాంటి హింసాత్మక సంఘటనలు అల్లర్లు గొడవలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నామన్నారు.

8వ కాలనీలో 48.41 పోలింగ్ నమోదు

- సంతోష్ నగర్‌లో మొరాయించిన ఈవీఎం మిషన్
- పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు లేక ఇబ్బందులు పడ్డ దివ్యాంగులు



దివ్యాంగుడికి సాయం చేస్తున్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సంతోష్ నగర్‌లోని 218 బూత్‌లో ఈవీఎం మిషన్ గంటన్నరకు పైగా మొరాయించడంతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు. దివ్యాంగుల కోసం మాత్రం రాంపులు ఏర్పాటు చేయకపోవడంతో దివ్యాంగ ఓటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.స్థానిక పోలీసుల సాయంతో వారు ఓటు హక్కు వినియోగించుకున్నారు. 8వ కాలనీలో 48.41 శాతం పోలింగ్ శాతం నమోదు అయింది.

ఓటుహక్కు వినియోగించుకున్న శ్రీధర్ బాబు



ధన్వాడలో ఓటు వేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్ బాబు

నవతెలంగాణ-మంథని మంథని నియోజకవర్గంలోని కాటారం మండలం ధన్వాడలో కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దుద్దిళ్ల శ్రీధర్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని తన స్వంత గ్రామమైన ధన్వాడలో ఓటు వేశారు. అనంతరం పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

ఓటు హక్కు వినియోగించుకున్న పుట్ట మధూకర్



ఓటు హక్కును వినియోగించుకుంటున్న పుట్ట మధూకర్

నవతెలంగాణ-మంథని

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా గురువారం రాజగృహాలో బాబాసాహెబ్ అంబేద్కర్, తన తల్లి పుట్ట లింగమ్మ విగ్రహానికి పూలమాల వేసిన నివాళి అర్పించిన ఆయన సుందిళ్ల గ్రామంలోని శ్రీ లక్ష్మినరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంథని మండలం వెంకటాపూర్ గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించు కున్నారు. ప్రజలంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

c m y k

ఓటర్ల నమోదులో జిల్లా యంత్రాంగం అద్భుత ప్రగతి

కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి


పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ - కరీంనగర్

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ జిల్లా యంత్రాంగం తరపున చేపట్టిన స్వీప్ కార్యక్రమాల ద్వారా జిల్లాలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ప్రక్రియను, పోలింగ్ కేంద్రాలలో చేపట్టిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి పరిశీలించారు. ఈ సందర్భంగా వివేకానంద పాఠశాలలోని 333, 334, స్వశక్తి కళాశాలలోని మోడల్ పోలింగ్ కేంద్రాలు 311,312, 313, కేడీసీసీ బ్యాంకులో ఏర్పాటు చేసిన 144, 145, సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలోని 189, 190, 191 పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిన సమయంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్న థర్డ్ జెండర్లతో కలిసి ఫొటోలు దిగారు. ఈ సందర్భంగా ఓటు హక్కును కల్పించినందుకు థర్డ్ జెండర్లు జిల్లా కలెక్టర్‌కు, యంత్రాగానికి కృతజ్ఞతలను తెలియజేశారు. అంతకుముందు స్వశక్తి కళాశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. ఓటర్లు ఓటు వేసిన తర్వాత వీవీ పాట్‌లో స్లిప్‌ను పరిశీలించుకోవాల్సిందిగా తెలియజేయాలన్నారు. అనంతరం పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ శ్రీలత, మెప్మా పీడీ రవీందర్, డీడబ్లూఓ సరస్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలను పరిశీలించిన ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్



నవతెలంగాణ - సైదాపూర్

సైదాపూర్ మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను జనరల్ అబ్జర్వర్ జయశ్రీభోజి పరిశీలించారు. సైదాపూర్, దుద్దెనపల్లి, ఎలాబోతరం, పెరుకపల్లి కేంద్రాలను పరిశీలించి అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు.

ఆకునూరులో రాత్రి వరకు పోలింగ్



నవతెలంగాణ - సైదాపూర్ : కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని ఆకునూరు గ్రామంలో రాత్రి 9గంటల వరకు పోలింగ్ జరిగింది. ఉదయం పనికి వెళ్లిన ఓటర్లు సాయంత్రం సమయంలో ఒకేసారి రావడంతో 5 గంటల లోపు పోలింగ్ కేంద్రం లోపలికి వచ్చిన ఓటర్లకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధికారులు అవకాశం కల్పించారు.

కరీంనగర్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికలు

- 64.17శాతం పోలింగ్
- ఉత్సహాంగా ఓటు వేసిన కొత్త ఓటుర్లు





నవతెలంగాణ - కరీంనగర్

తెలంగాణ అసెంబ్లీ 2023 ఎన్నికల్లో భాగంగా కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన మంత్రి గంగుల కమలాకర్ ఆయన కుటుంబసభ్యులతో కలిసి నగరంలోని క్రిస్టియన్ కాలనీలోని శ్రేయ వొకేషనల్ జూనియర్ కాలేజి 179వ పోలింగ్ బూత్‌లో, బీజేపీ అభ్యర్థి, ఎంపీ బండి సంజయ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి జ్యోతినగర్‌లోని సాధన స్కూల్‌లోని 174 పోలింగ్ బూత్‌లో, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పురమల్ల శ్రీనివాస్ తన సతిమణి జెడ్పీటీసీ పురమల్ల లలితతో కలిసి ఓటుహక్కు వినియోగించుకుని మాట్లాడారు. ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి అంబటి జోజిరెడ్డి కరంనగర్ నియోజకవర్గంలోని లక్ష్మిపూర్ గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఓటు హక్కును వినియోగించుకోని మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేసేందుకు ఓటు వినియోగించుకోవాలన్నారు. మేయర్ యాదగిరి సునీల్‌రావు, అపర్ణ నగరంలోని 33వ డివిజన్ భగత్ నగర్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. డిప్యూటి మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ దంపతులు తమ ఓటు హక్కును 37 వడివిజన్‌లో వినియోగించుకున్నారు. వారితో పాటు లైబ్రరీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్ రేకుర్తిలో 18వ డివిజన్‌లో బూత్ నంబర్ 36లో కుటుంబ సభ్యలతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ శాతం 64.17శాతం..

కరీంనగర్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన క జరిగిన ఎన్నికల్లో 2014లో ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం నుంచి 58.49శాతం పోలింగ్ శాతం నమోదైంది. 1,88,673 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 2018 ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గం 69.29 పోలింగ్ శాతం నమోద కాగా ఓటర్లు 1,98,926 ఓట్లు వేశారు. 2023 ఎన్నికల్లో కరీంనగర్ నియోజకవర్గంలో 64.17 పోలింగ్ శాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు.

పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన పోలీస్ కమిషనర్


చొప్పదండిలో పరిశీలిస్తున్న సీపీ

నవతెలంగాణ - కరీంనగర్ క్రైం

కరీంనగర్ జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను సీపీ అభిషేక్ మొహంతి పరిశీలించారు. చొప్పదండి, మానకొండూర్, హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల్లోని పలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను, వాటి భద్రత కోసం ఏర్పాటు చేసిన సిబ్బంది, పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలోని వీణవంక మండల కేంద్రంలోని, నర్సింగాపూర్ గ్రామాల్లోని కేంద్రాలను, వాటి భద్రత కోసం ఏర్పాటు చేసిన సిబ్బంది, పోలింగ్ ప్రక్రియను స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు. వారి వెంట పోలీసులు తదితరులున్నారు.

చొప్పదండిలో..

నవతెలంగాణ - చొప్పదండి

చొప్పదండి నియోజకవర్గ కేంద్రంలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కరీంనగర్ జిల్లా పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి పోలింగ్ సరళిని పరిశీలించారు. చొప్పదండి మున్సిపల్ కమిషనర్ పి.శాంతి కుమార్‌ను ఓటరు నమోదు శాతాన్ని, శాంతి భద్రతల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎస్సై ఉపేంద్రచారి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మానకొండూర్ నియోజకవర్గంలో 75.12శాతం పోలింగ్




నవతెలంగాణ - మానకొండూర్ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మానకొండూర్‌లో ప్రశాంతంగా ముగిసింది. పెద్ద సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చితమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. తొలిసారి ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహం చూపించారు. సాయంత్రం 5 గంటలకు ఓటింగ్ ముగిసేసరికి నియోజకవర్గ వ్యాప్తంగా 75.12శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. మానకొండూర్ మండలకేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జివి.రామకృష్ణారావు, బీజేపీ అభ్యర్థి ఆరేపల్లి మోహన్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని పచ్చునూర్ గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కవ్వంపల్లి సత్యనారాయణ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కరీంనగర్ సిపి అభిషేక్ మహంతి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.

గర్శకుర్తిలో మొరాయించిన ఈవీఎంలు



నవతెలంగాణ - గంగాధర

గంగాధర మండలంలో గురువారం జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలోని 33 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన పోలింగ్‌లో ఓటర్లు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం వరకు పుంజుకోగా, బారులుదీరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలోని మేజర్ గ్రామమైన గర్శకుర్తిలో రెండు బూత్‌లలో ఈవీఎంలు మొరాయించగా, సిబ్బంది మరమ్మతులు చేసి పునరుద్ధరించారు. మేజర్ గ్రామాలైన గట్టుభూత్కూర్, మధురానగర్, ఉప్పరమల్యాల, బూర్గుపల్లి, గర్శకుర్తి, గంగాధరతోపాటు ప్రతి గ్రామంలోని 5 గంటలు దాటినా ఓటర్లు క్యూలైన్లలో బారులుదీరి కనిపించారు. అయితే క్యూలైన్లలో నిలబడిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించగా, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తుగా పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. మండలంలోని బూర్గుపల్లి గ్రామంలో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా కాంగ్రెస్ అభ్యర్థి మేడిపల్లి సత్యం మధురానగర్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. చర్లపల్లి (ఆర్) గ్రామంలో జడ్పీటీసీ పుల్కం అనురాధ, కొండగట్టు ఆలయ ధర్మకర్త పుల్కం నర్సయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. నిబంధనలను అనుసరించి పోలీసులు పకడ్బందీగా క్యూలైన్లలో జనం నిలిచేలా చర్యలు చేపట్టగా, వాలంటీర్లు ఓటర్లను క్యూ ప్రకారం పోలింగ్ కేంద్రాల్లోకి అనుమతించారు. గుర్తింపు కార్డులు లేకుండా పోలింగ్ సిబ్బంది ఓటు వేసేందుకు అనుమతినివ్వకపోగా, ఓటర్లు చాలా చోట్ల పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఇళ్లకు వెళ్లి గుర్తింపు కార్డులు తెచ్చుకుని ఓట్లు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

హుజురాబాద్‌లో 70.23శాతం పోలింగ్

ఓటు వేసిన కౌశిక్‌రెడ్డి, ఈటల రాజేందర్, ప్రణవ్ బాబు


కుటుంబ సభ్యులతో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతారావు

నవతెలంగాణ - హుజురాబాద్

హుజురాబాద్ నియోజకవర్గంలో గురువారం పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు రిటర్నింగ్ అధికారి ఎస్.రాజు తెలిపారు. నియోజకవర్గంలో 305 పోలింగ్ బూత్‌లు ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు 70.23శాతం పోలింగ్ జరిగినట్టు అధికార వర్గాలు తెలిపాయి. 5గంటల వరకు లైన్‌లో ఉన్న వారికి ఓటు వేయడానికి అధికారుల అవకాశం ఇవ్వడంతో పలుచోట్ల రాత్రి 8వరకు కూడా పోలింగ్ జరుగింది. హుజురాబాద్ నియోజకవర్గంలో మొదటి రెండు గంటల వరకు కేవలం 5.63శాతం పోలింగ్ జరిగింది. 11 గంటల వరకు 18.03శాతం, మధ్యాహ్నం ఒంటిగంట వరకు 41.40శాతం, మూడు గంటల వరకు 55.71శాతం, సాయంత్రం 5 గంటల వరకు 70.23 శాతం జరిగినట్లు అధికారులు తెలిపారు. కాగా పోలింగ్ సమయం ముగిసే వరకు పోలింగ్ బూత్‌లలో వందలాదిమంది ఉండడంతో అధికారులు వారికి ఓటు వేయడానికి అవకాశం ఇచ్చారు. దీంతో రెండు సుమారు రెండు గంటల పాటు పోలింగ్ జరిగా అవకాశం కనబడుతుంది. సాయంత్రం జరిగే ఓటింగ్ వల్ల పోలింగ్ శాతం పెరగడమే కాకుండా అభ్యర్థుల గెలుపోవటములపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు. నియోజకవర్గంలోని హుజురాబాద్, జమ్మికుంట, వీణవంక, కమలాపూర్, ఇల్లందకుంట మండలాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. వీణవంక మండల కేంద్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి, హిమ్మత్ నగర్ గ్రామంలో తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, సింగాపూర్ గ్రామంలో మాజీ ఎంపీ కెప్టెన్ లక్ష్మీకాంతరావు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రణవ్ బాబు, హుస్నాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి సతీష్ బాబు, కమలాపూర్ మండల కేంద్రంలో బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్, హుజురాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుజురాబాద్ నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా జరగడానికి పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లను చేశారు. హుజురాబాద్ లోని బాలికల ఉన్నత పాఠశాలను మోడల్ పోలింగ్ స్టేషన్‌గా అందంగా రూపొందించారు. చాలామంది ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ముందు ఫొటోలు దిగే తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.


టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ దంపతులు